

ఎంత బ్రతిమిలాడినా రాడమ్మా..!
అమ్మ రోదన



చిగిలి గ్రామంలో శ్మశాన వైరాగ్యం
ప్రతి గడపా కన్నీటిమయం

వివరాలు 7వ పేజీలో

చిగిలి గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. కన్నీటి వరద కట్టలు తెగింది. శ్మశానం సైతం గుండెలు పగిలేలా రోదించింది. ఒకరా ఇద్దరా ఆరుగురు చిన్నారులు.. ఏ ఇంట చూసినా ఏడుపులే. ఏ కంట చూసినా ఉబికివస్తున్న కన్నీరు. తల్లిదండ్రులను, తోబుట్టువులు, స్నేహితులు, బంధువులను కన్నీటి సుడిలో నెట్టివేసిన ఆరుగురు చిన్నారులు అందరినీ వదిలేసి అంతులేని వ్యథను మిగిల్చారు. 'కొడుకా.. లేరా.. నాయనా, బిడ్డా, బంగారు, బుజ్జికన్నా..' అంటూ తల్లిదండ్రుల ఏడుపులు.. 'నన్ను వదిలిపోయేందుకు నీకు మనసెలా వచ్చింది..' అంటూ కన్న బిడ్డల అచేతన శరీరాలపై పడి గుండెలు పగిలేలా రోదనలు.. ఏ గడప చూసినా కన్నీటి సంద్రమే. ఏడ్చిఏడ్చి కన్నీళ్లు ఆవిరైపోయాయి గానీ వారి గుండెల్లో బాధ మాత్రం ఇసుమంత కూడా తగ్గలేదు. చుట్టపక్కల పల్లెలన్నీ ఓదార్పునకు వరదలా కదిలొచ్చాయి. చనిపోయిన చిన్నారులతో ఉన్న ఆత్మీయతను, అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ విలపించిన తీరు అందరినీ కలచివేసింది. బుధవారం నీటి గుంతలో పడి మృతి చెందిన ఆరుగురు చిన్నారుల అంత్యక్రియలు గురువారం ఆస్పరి మండలం చిగిలి గ్రామంలో ముగిశాయి. ఊరు ఊరంతా వల్లకాడుగా మారినట్టు రోదనలు, ఆర్తనాదాలతో పల్లె కన్నీరు పెట్టుకుంది. చిన్నారుల మృతదేహాలు శ్మశానం వైపు కదులుతుంటే... బరువెక్కిన హృదయంతో ప్రతి ఒక్కరూ వెంటసాగారు. రోజూ యూనిఫాంలో భవిష్యత్తు కోసం కోటి ఆశలతో బడికి వెళ్లే ఆ చిన్నారులు ఈరోజు అదే బడి ఎదుట శవాలైపోయారు.

చిగిలి గుండె పగిలి

- చిగిలి గ్రామంలో ముగిసిన ఆరుగురు చిన్నారుల అంత్యక్రియలు
- వందలాదిగా తరలివచ్చిన ప్రజలు
- కన్నీరు పెట్టిన ఊరు



శశికుమార్ మృతదేహంతో..

ఆదోని/ఆస్పరి/ఆదోని రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సరదాగా ఈతకు వెళ్లి ఆరుగురు చిన్నారులు మృతి చెందడంతో ఊరు కన్నీరు పెట్టింది. ఆరు కుటుంబాలు ఆర్తనాదాలతో అంతిమ వీడ్కోలు పలికాయి. ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లినా... ఆటలు ఆడినా.. ఒక్కటిగానే కలిసిమెలిసి ఉండేవారు. విధిరాతలో ఒకరిని కాపాడడానికి వెళ్లి మరొకరు అలా ఆరుగురు చిన్నారులు నీటికుంటలో మునిగి అసువులు బాశారు. చివరికి చావులోనూ వీరు స్నేహాన్ని వీడలేదు. వీరి అంత్యక్రియలు గురువారం కన్నీటిసుడుల మధ్య పూర్తయ్యాయి. వీరి రోదనలు చూసిన ఆ గ్రామం కన్నీళ్లు కార్చింది. ఆస్పరి మండలం చిగిలి గ్రామానికి చెందిన వై.కిన్నెరసాయి(10), శశికుమార్(10), సాయికిరణ్(10), భీమేష్(10), వినయ్(10), మహబూబ్‌బాషా(10)లతో పాటు దుర్గాప్రసాద్ స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నారు.



కడదారి..
చిన్నారుల శవాలతో శ్మశానవాటిక వైపు తరలివెళ్తున్న ప్రజలు



వంద శాతం అక్షరాస్యతకు కృషిచేయాలి

వయోజన విద్య ఉప సంచాలకులు చంద్రశేఖర్ రెడ్డి



మాట్లాడుతున్న వయోజన విద్య ఉప సంచాలకుడు చంద్రశేఖర్‌రెడ్డి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వంద శాతం అక్షరాస్యత సాధించేలా ప్రతి అధికారి కృషిచేయాలని అన్నారు. గురువారం పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా వయోజన ఆధ్వర్యంలో 'ఉల్లాస్ - అక్షరాంధ్ర'లో భాగంగా ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని జడ్పీ సీఈవో సుబ్బారెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 3.02,050 మందిని వయోజన నిరక్షరాస్యులుగా గుర్తించారన్నారు. మొదటి విడతలో భాగంగా 1.00.686 మందిని ఈ ఏడాది అక్షరాస్యులుగా మార్చేందుకు సంబంధిత శాఖల సహకారంతో యాక్షన్ ప్లాన్ రూపొందించామన్నారు. అక్షరా స్యులైన వారికి 2026 మార్చిలో ఎఫ్ఎల్ఎన్ఏ పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణు లైన వారికి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ వారి నుంచి ధ్రువపత్రాలను అందజేస్తామన్నారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, డీఈవో జనార్ధన్‌రెడ్డి, డ్వామా పీడీ సూర్యనారాయణ, డీఎల్‌డీవో శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

508 సెల్‌ఫోన్లు రికవరీ

బాధితులకు అందజేసిన ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా



బాధితులకు సెల్‌ఫోన్లు అందజేసిన ఎస్పీ

నంద్యాల టౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చోరీకి గురైన 508 సెల్‌ఫోన్లను బాధితులకు అందజేసినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. గురువారం పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో రికవరీ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సెల్‌ఫోన్లను వివిధరాష్ట్రాల నుంచి మహారాష్ట్ర, తమిళనాడు, గోవా, ఏపీ, తెలంగాణ వంటి ప్రాంతాల నుంచి సైబర్‌క్రైం వారి సహకారంతో 508 ఫోన్లను రికవరీచేసినట్లు తెలిపారు. వాటివిలువ సుమారుగా రూ.83,82,000 ఉంటుందని చెప్పారు. జిల్లాలో అతి తక్కువ సమయంలో ఎవరి ఫోన్లను వారికి అందజేశామన్నారు. ఇంకా మిగిలిన ఫోన్లను వారి పరిధిలోని డీఎస్పీ కార్యాలయంలో అందజేయనున్నట్లు తెలిపారు. సెల్‌ఫోన్ పోతే వెంటనే 9121101107 నెంబర్‌కు హాయ్ అని మెసేజ్ చేస్తే వెంటనే లింక్ వస్తుందని, అందులో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ యుగంధర్‌బాబు, ఎస్పీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సైబర్ క్రైం సీఐ వంశీధర్, జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



ఓల్డ్ పంప్‌హౌస్ దగ్గర తుంగభద్రలో కలుస్తున్న మురుగు (ఫైల్)

కార్పొరేషన్‌పై ఎన్‌జీటీ ఆగ్రహం..!

- తుంగభద్ర నదిలోకి యథేచ్ఛగా మురుగు
- కలుషితం అవుతున్న నదులు
- రూ.5.20 కోట్లు అపరాధ రుసుము
- అప్పీల్‌కు వెళ్లిన కార్పొరేషన్ అధికారులు
- మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణంలో జాప్యం
- ఇంజనీర్లకు మెమోలు జారీచేసిన కమిషనర్

కర్నూలు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర జనాభా ప్రస్తుతం జనాభా ఆరు లక్షలకు పైగా చేరిందని అంచనా. 51 వార్డులు ఉన్నాయి. ప్రజల తాగునీరు, వివిధ అవసరాల కోసం రోజుకు 75-80 మిలియన్ లీటర్లు (ఎంఎల్‌డీ) సరఫరా చేస్తున్నారు. అందులో 65-70 శాతం నీరు ప్రజల వినియోగం తర్వాత 50-55 ఎంఎల్‌డీ నీరు మురుగు కాల్వలకు చేరుతుందని ఇంజనీర్లు అంచనా వేస్తున్నారు. ఓల్డ్ తుంగభద్ర పంప్‌హౌస్, రోజాదర్గా, సంకల్‌బాగ్, సాయిబాబా టెంపుల్, బండిమెట్ట, రాంబోట్ల టెంపుల్ ఏరియా తదితర 14 ప్రాంతాల్లో తుంగభద్ర నదిలో మురుగునీరు కలుస్తుంది. కల్లూరు, కల్లూరు ఎస్టేట్, దేవానగర్, కృష్ణానగర్, చెన్నమ్మ సర్కిల్ తదితర కాలనీలకు చెందిన మురుగునీరు హంద్రీనది, వక్కలేరు వాగుల్లో కలసి జోహరాపురం వంతెన సమీపంలో తుంగభద్రలో చేరుతుంది. నదీజలాలు ఏమేరకు కలుషితం అవుతున్నాయో..? అని ఏపీ వాతావరణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మురుగునీటి సమూనాలు సేకరించి పరీక్షలు చేస్తే విషపూరితాలు ఉన్నట్లు వెలుగు చూసినట్లు సమాచారం. మురుగునీటి వల్ల తుంగభద్ర ఏరీతిన కలుషితం అవుతుందో 'ఆంధ్రజ్యోతి' సహా పలు పత్రికలు కథనాల ద్వారా వెలుగులోకి తెచ్చాయి.

-మిగతా 6వ పేజీలో



బాల్యవివాహాలకు దూరంగా ఉండాలి

సీనియర్ సివిల్ న్యాయాధికారి తంగమణి



మాట్లాడుతున్న న్యాయాధికారి తంగమణి

నంద్యాల క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అమ్మాయిలు బాల్య వివాహాలకు దూరంగా ఉండి లక్ష్యాలను చేరుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. గురువారం నంద్యాల పట్టణంలోని ఎస్టీ బాలికల వసతిగృహాన్ని జడ్జి తనిఖీ చేసి విద్యార్థినులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జడ్జి తంగమణి మాట్లాడుతూ కౌమారదశలో వచ్చే సమస్యలు, బాల్య వివాహాల ద్వారా వచ్చే సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ సిబ్బంది రామచంద్రారెడ్డి, హాస్టల్ వార్డెన్లు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పూడిక చేరిన దద్దనాల ప్రాజెక్టు


డేంజర్‌లో దద్దనాల

- పనిచేయని ప్రధాన, పూడిక గేట్లు
- మరమ్మతులకు నోచుకోని వైనం
- 10 అడుగుల మేర పేరుకుపోయిన మట్టి
- వేల ఎకరాలకు సాగునీరు.. 15 గ్రామాలకు తాగునీరు
- ప్రశార్ధకంగా ప్రాజెక్టు మనుగడ

దద్దనాల ప్రాజెక్టుకు ప్రమాదం పొంచి ఉంది. రైతులకు సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు అందించే ప్రాజెక్టు ఇది. గత వైసీపీ హయాంలో సరైన నిర్వహణ లేకపోవడంతో ప్రాజెక్టు ప్రమాదకరంగా మారింది. ప్రధాన గేట్లలో ఒకటి, పూడిక గేట్లు కూడా పనిచేయడం లేదు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 25అడుగులు కాగా 10అడుగులకు పైగా లోతు పూడికతో నిండిపోయింది. దీంతో ప్రాజెక్టు మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. పది రోజుల క్రితం ప్రాజెక్టుకు సంబంధించి పనిచేస్తున్న ఒక్క గేటు కూడా మొరాయించింది. ఎట్టకేలకు కర్నూలు నుంచి నిపుణులను రప్పించి మైనర్ ఇరిగేషన్ అధికారులు గేటు యథావిధిగా పనిచేసేలా చర్యలు తీసుకున్నారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

బనగానపల్లె, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఒకే ఒక మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు దద్దనాల ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి రెండు ప్రధాన గేట్లలో ఒక గేటు, రెండు పూడికగేట్లు పనిచేయడం లేదు. ప్రాజెక్టు అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని ప్రభుత్వానికి మైనర్ ఇరిగేషన్ అధికారులు నివేదికల పంపడం జరుగుతోంది. నిధులు విడుదల కావడం లేదు. మండలంలోని పాతపాడు గ్రామం వద్ద ఈ ప్రాజెక్టును నిర్మించారు. ఈప్రాజెక్టు కింద ప్రత్యక్షంగా 1516 ఎకరాలకు పరోక్షంగా పది వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. 15 గ్రామాలకు ఈ ప్రాజెక్టు ద్వారా తాగునీరు అందుతోంది. గతంలో ప్రాజెక్టులోకి నీరురాక ఒట్టిపోయింది. 15 ఏళ్లుగా ప్రధాన గేట్లు, పూడిక గేట్లు మరమ్మతులకు నోచుకోలేదు. ఇందులో ఓ గేటు ఇటీవలే మరమ్మతులు చేశారు. ప్రాజెక్టు మరో ప్రధానగేటు ఒకటి, రెండు పూడిక గేట్లు, మరమ్మతులకు నోచుకోలేదు. దీనికి తోడు 10అడుగుల వరకు మట్టితో ప్రాజెక్టులో నీరు చేరింది. దీంతో ప్రాజెక్టు మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

- మిగతా 8వ పేజీలో



మరమ్మతులకు నోచుకోని దద్దనాల ప్రాజెక్టు గేటు



స్వర్ణ పంచాయతీతో స్వాహాకు చెక్

24 మండలాల్లో సరాసరిగా ఐదు శాతం మాత్రమే..

- ఆస్తి, నీటి పన్నుల వసూళ్లలో వెనుకంజ
- నిధుల స్వాహాల్లో ఉద్యోగులు ముందంజ
- ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అధికారులు
- ప్రక్షాళన దిశగా ప్రభుత్వం అడుగులు
- సెప్టెంబరు 1 నుంచి ఈ పోర్టల్‌లో బిల్లులన్నీ నమోదు

పంచాయతీల్లో వైసీపీ హయాంలో పాలన గాడి తప్పింది. అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. అందినకాడికి దోచుకున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా లక్షల నిధులు స్వాహా అయ్యాయి. జిల్లాలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో, పలు పంచాయతీల్లోని నిధులు గోల్‌మాల్ అయ్యాయి. దీన్ని చక్కదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. సెప్టెంబరు ఒకటి నుంచి పంచాయతీలో ఆర్థిక అంశాలను సమగ్ర వివరాలతో స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో బ్లీచింగ్, వీధి దీపాలు, శానిటరీ పరికరాలు, పారిశుధ్య, పనులు తదితర వివరాలన్నీ బిల్లులు అప్‌లోడు చేయాలి. అనంతరం సీఎఫ్‌ఎంఎస్ ఆమోదం తెలుపుతాయి. గ్రామ పంచాయతీల్లో ఆస్తిపన్ను వివరాలు ఆన్‌లైన్ ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 'స్వర్ణ పంచాయతీ' పోర్టల్‌తో స్వాహా పర్వానికి చెక్ పెట్టేందుకు సిద్ధమైంది.

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామ పంచాయతీల పాలన గాడి తప్పింది. దీపం ఉండగానే ఇల్లు చక్క దిద్దుకోవాలనే ఆలోచనలో కొందరు అధికారులు చేతివాటం ప్రదర్శించారు. ప్రజల సొమ్మును కాజేశారు. పంచాయతీల సర్వతోముఖాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధులు పక్కదారి పట్టాయి. గ్రామాల అభివృద్ధి కోసం పనిచేయాల్సిన కొందరు సర్పంచులు ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డీఎల్‌పీవోలు అందినకాడికి దండుకున్నారు. అక్రమార్కులకు అధికారుల అండదండలు ఉండటంతో నిధులు దుర్వినియోగం వెలుగులోకి రావడం లేదని విమర్శలున్నాయి. జిల్లాలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా లక్షల నిధులు స్వాహా అయ్యాయి. పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పలు పంచాయతీల్లో నిధులు గోల్‌మాల్ అయ్యాయి. పన్నుల రూపంలో ప్రజలు చెల్లించిన నగదును పంచాయతీకి జమ చేయకపోవడం, చేయని పనులు చేసినట్లు చిత్రీకరించి బిల్లులు పొందడం.. కాంట్రాక్టు సిబ్బంది జీతాల పేర్లతో నగదు కాల్ చేయడం, జిల్లా అధికారుల ఖర్చుల పేర్లతో నకిలీ బిల్లులతో నగదును డ్రా చేశారు. అధికారులు విచారణ పేరుతో కాలయాపన చేస్తుండటంతో అక్రమార్కుల పదవి కాలం ముగుస్తోందన్న విమర్శలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో జరిగిన పంచాయతీల నిధుల దుర్వినియోగంపై జిల్లా విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టాలని ప్రజా సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాయి.



జిల్లా పంచాయతీ కార్యాలయం

ప్రభుత్వానికి రావాల్సిన నీటి పన్ను విషయంలో జిల్లా పంచాయతీ అధికారులు పూర్తిగా నిర్లక్ష్య ధోరణిలో ఉన్నారని విమర్శలు ఉన్నాయి. క్రిష్ణగిరి, పెద్దకడుమూరు మండలాల్లో ఇంతవరకు ఒక్క రూపాయి కూడా వసూలు కాలేదు. కేవలం కోడుమూరు మండలంలో మాత్రమే 90 శాతం ప్రజలు నీటి పన్ను కట్టారు. మిగతా 24మండలాల్లో సరాసరిగా ఐదు శాతం కూడా నీటి పన్ను వసూలు చేయలేదు. జిల్లా పంచాయతీ అధికారుల నిర్లక్ష్య ధోరణితో ప్రభుత్వానికి రావాల్సిన ఆస్తి , నీటి పన్ను విషయంలో చూసీచూడనట్లు వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తోంది. ఆస్తిపన్ను వసూళ్లలో జిల్లా పంచాయతీ కార్యదర్శులు పూర్తిగా వెనుకబడి ఉన్నారు. జిల్లాలో గోనెగండ్ల, కౌతాళం, ఆదోని, హాలహర్వి, క్రిష్ణగిరి, కోసిగి, పెద్దకడుమూరు, ఆలూరు, తుగ్గలి, ఆస్పరి, దేవనకొండ, హొళగుంద మండలాల్లో 50 శాతం కూడా ఆస్తి పన్నులు వసూలు కాలేదు. కేవలం కోడుమూరు, చిప్పగిరి మండలాల్లో మాత్రమే 90 శాతం ఆస్తి పన్ను వసూలు కావడం జరిగింది.

సమగ్ర వివరాలతో..

సెప్టెంబరు 1వ తేదీ నుంచి పంచాయతీలో ఆర్థిక అంశాలను సమగ్ర వివరాలతో స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో బ్లీచింగ్, వీధి దీపాలు, శానిటరీ పరికరాలు, పారిశుధ్య పనుల బిల్లులు అప్‌లోడు చేయాలి. అనంతరం సీఎఫ్‌ఎంఎస్ ఆమోదం తెలుపుతాయి. గ్రామ పంచాయతీలలో ఆస్తిపన్ను వివరాలు ఆన్‌లైన్ ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2025-26 ఆర్థిక సంవత్స రానికి సంబంధించి ప్రజలకు ఆన్‌లైన్‌లోనే డిమాండ్ నోటీసులు జారీ చేయనున్నారు. పన్ను వసూలు నగదు రహితంగా చేపట్టనున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పన్నుల వసూలు ప్రజల నుంచి ఎంత వసూలు చేశారో.. బ్యాంకులో ఖాతాల్లో ఎంత జమ చేశారో కూడా కార్యాలయంలో సరైన లెక్కలు లేవు. జిల్లాలోని కొంత మంది పంచాయతీ కార్యదర్శులు పన్ను మొత్తాన్ని జేబులో వేసుకుని సొంత అవసరాలు వాడుకున్నాడని ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి.

ఆస్తి, నీటి పన్ను కచ్చితంగా కట్టాలి



2024-25 సంవత్సరానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఆస్తి, నీటి పన్ను బకాయిలను కచ్చితంగా కట్టాలి. ఎవరైనా అవినీతికి పాల్పడితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంచాయతీ కార్యదర్శులు, డిప్యూటీ ఎంపీడీవోలు, డీఎల్‌పీవోలపై చర్యలు తీసుకుంటాం.

● భాస్కర్, డీపీవో, కర్నూలు

బహుముఖ ప్రజ్ఞాశాలి ప్రకాశం పంతులు

- క్లస్టర్ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ వెంకట బసవరావు
- క్విజ్ పోటీ విజేతల జాబితా విడుదల



క్విజ్ విజేతల జాబితా విడుదల చేస్తున్న ఇన్‌చార్జి ఉపకులపతి, రిజిస్ట్రార్

కర్నూలు అర్బన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రకాశం పంతులు స్వాతంత్ర్య సమరయోధుడే కాదు బహుముఖ ప్రజ్ఞాశాలి అని క్లస్టర్ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ వెంకట బసవరావు అన్నారు. గురువారం క్లస్టర్ యూనివర్సిటీలో ఈనెల 23న జరిగే ప్రకాశం పంతులు 153వ జయంతి వేడుకల సందర్భంగా రిజిస్ట్రార్ జీ. శ్రీనివాసులుతో కలిసి క్విజ్ పోటీల్లో విజేతల జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు సీఎంగా ప్రమాణ స్వీకారం కర్నూలు జిల్లాలోనే చేయడం ఎంతో గర్వకారణమన్నారు. రిజిస్ట్రార్ జీ. శ్రీనివాసులు మాట్లాడుతూ దేశానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. గాడచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు కల్కూర చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు బాల్యం నుంచే పోరాట పటిమ ఉన్న వ్యక్తి అని, పేదలకు ఉచితంగా న్యాయ సలహాలు ఇచ్చే వారని తెలిపారు. ఈ క్విజ్ పోటీలకు కర్నూల్లోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులైన విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు ఈనెల 23న కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఇందిరా శాంతి, కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కే. వెంకటరెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ బీఆర్ ప్రసాదరెడ్డి, మానవ వనరుల పరిశోధనా కేంద్రం వ్యవస్థాపకులు మన్సూర్ రమహమాన్ , క్లస్టర్ వర్శిటీ డీన్‌లు అక్తర్ భాను, నాగరాజు శెట్టి, మహమ్మద్ వాహీద్, అధ్యాపకులు ఫామీద, ఎల్లాకృష్ణ, జయలక్ష్మి, రాధా రమణి, డి. పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐటీఐలలో మిగిలిన సీట్ల ఖాళీల భర్తీ చేయుటకు మూడో విడత ప్రవేశాలకోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వాని స్తున్నట్లు ప్రభుత్వ జిల్లాస్థాయి శిక్షణ సంస్థ సహాయ సంచాలకులు ఆర్.కృష్ణమోహన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 26వ తేదీ ఆఖరి గడువు అన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసు కెళ్లి వెరిఫికేషన్ చేయించుకున్న వారు అర్హులన్నారు. 29వ తేదీన ఉదయం 10.30 గంటలకు కర్నూలు ఐటీఐలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కర్నూలు డీఎల్‌డీసీలో టెక్నాలజీ టైలరింగ్, ఎలక్ట్రిషన్, ఫిట్టర్ వంటి ఖాళీలు భర్తీ చేస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రుధిరంతో చిరంజీవి చిత్రం



సినీ హీరో మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదినం సందర్భంగా నందికొట్కూరుకు చెందిన శ్రీనివాసులు తన రక్తంతో గురువారం చిరంజీవి చిత్రాన్ని గీశారు. సినీ పరిశ్రమలో ప్రాణం ఖరీదు సినిమాతో అడుగుపెట్టిన తాను విశ్వంభర చిత్రంతో జనం ముందుకు వస్తున్నారని శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈవయస్సులో కూడా యువ హీరోలతో పోటీ పడుతూ ప్రజల అభిమానాన్ని పొందుతున్నారని, ఆయన ఆయురారోగ్యాలతో వందేళ్ల జీవించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు.

● నందికొట్కూరు, ఆంధ్రజ్యోతి

రోగులకు కనీస సౌకర్యాలేవీ?

- ఎంసీహెచ్ బ్లాక్ వద్ద దోమల బెడద
- క్యాజువాలీటీలో స్ట్రెచర్ కోసం వసూళ్లు
- సిబ్బంది లేక బంధువులే తోస్తున్న వైనం



ప్రసూతి విభాగం ఎదుట అర్ధరాత్రి రోడ్డుపైన నిద్రిస్తున్న బంధువులు

కర్నూలు హస్పిటల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులకు కనీససౌకర్యాలు లేక ఇక్కట్లు పడుతున్నారు. హస్పిటల్‌కు ప్రతి రోజు 2,500 నుంచి 3వేల మంది రోగులు ఏడు జిల్లాల నుంచి చికిత్స కోసం వస్తుంటారు. బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేసింది. ఈ విజిట్‌లో రోగులకు కనీస సౌకర్యాల కరువయ్యాయి. ప్రసూతి విభాగం వద్ద కాన్పులకోసం వచ్చిన గర్భిణులకు, సహాయకులకు సౌకర్యాలు కరువయ్యాయి. ఈ విభాగం ఎదుట రోడ్డుపై బంధువులు నిద్రిస్తున్నారు. దోమల బెడద ఎక్కువగా ఉందని, అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఇక చిన్న పిల్లల విభాగం ఈఎస్ఆర్ అత్యవసర వార్డు సమీపంలో మురుగు నిలిచిపోవడంతో దుర్వాసన వస్తోందని బంధువులు చెప్పారు. పైపులైన్లు ధ్వంసం కావడం వల్ల నీరు ఒక చోట నిలిచిపోయి వాసన వస్తోందన్నారు. క్యాజువాల్టీలో అత్యవసర రోగులకు పడకలు కరువయ్యాయి. ఒకే మంచంపై ఇద్దరు రోగులకు పడుకోబెట్టి చికిత్స అందిస్తున్నారు. ఇక క్యాజువాల్టీలో స్ట్రెచర్లు, వీల్ ఛైర్లకు పారిశుధ్య కార్మికులు డబ్బులు అడుగుతున్నారని రోగుల బంధువులు ఫిర్యాదు చేశారు. రోగులకు స్ట్రెచర్‌పై ఉంచి బంధువులే పరీక్షల కోసం తీసుకెళ్తున్నారు. రాత్రి 11.50 గంటలకు క్యాజువాల్టీ సీఎంవో డా.శ్వేత విధుల్లో ఉన్నారు. రాత్రి పూట క్యాజువాల్టీలో ఇద్దరు సీఎంవోలను ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు. అర్ధరాత్రి కొందరు ప్రైవేటు ల్యాబ్ టెక్నీషియన్లు క్యాజువాల్టీ, గైనిక్ వార్డుల దగ్గర ఉండి పరీక్షల కోసం శ్యాంపిళ్ల తీసుకెళ్తున్నారు.



క్యాజువాల్టీలోని రెడ్‌జోన్‌లో ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులు

కార్పొరేషన్‌పై ఎన్‌జీటీ ఆగ్రహం..

(5వ పేజీ తరువాయి)

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది. కార్పొరేషన్ విడుదల చేస్తున్న మురుగునీటి వ్యర్థాల వల్లే తుంగభద్ర జలాలు కలుషితం అవుతున్నాయని నిగ్గు తేల్చింది. రూ.5.20 కోట్లు అపరాధ రుసుం (ఫైన్) చెల్లించాలని చెన్నైలోని ఎన్‌జీటీ 2024 డిసెంబరు 23న ఓఏ నంబరు.13/2021(ఎస్‌జడ్) తుది ఉత్తర్వులు జారీచేసింది. మూడు నెలల్లో చెల్లించాలని, లేని పక్షంలో 2020 డిసెంబరు 23 నుంచి నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుందని స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. ఎన్‌జీటీ తీర్పుకు లోబడి అపరాధ రుసుం రూ.5.20 కోట్లు గడువులోగా చెల్లించాలని. లేని పక్షంలో నష్టపరిహారం కూడా చెల్లించక తప్పదని, 57.6 ఎంఎల్‌డీ సామర్థ్యంలో మురుగు నీటి శుద్ధి కేంద్రాలు (ఎస్‌టీపీ) తక్షణమే పూర్తి చేసి మురుగునీరు శుద్ధి చేయాలని, 12 నెలల్లోగా ఈ పనులు పూర్తి చేయాలని విజయవాడకు చెందిన ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీ ఎసీబీ) సభ్య కార్యదర్శి గతనెల జూలై 23న కార్పొరేషన్ అధికారులకు నోటీసులు జారీచేశారు. ఆ దిశగా చర్యలు నామమాత్రంగా ఉన్నాయి. 13 ఎస్‌టీపీ ప్లాంట్‌లు నిర్మిస్తామని కర్నూలు కార్పొరేషన్ అధికారులు గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఇచ్చిన అఫిడ విట్‌లో పేర్కొన్నట్లు తెలుస్తుంది. సకాలంలో అపరాధ రుసుం చెల్లించకపోవడంతో ప్రతి నెల ఒక్కో ఎస్‌టీపీకి రూ.5లక్షలు చొప్పున 13 ఎస్‌టీపీలకు రూ.65లక్షలు వరకు నష్టపరిహారం చెల్లించాల్సి వస్తుందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు.



జోహరాపురం బిడ్జి దగ్గర తుంగభద్రలో హంద్రీ నది కలిసే ప్రదేశంలో నిర్మిస్తున్న 10 ఎంఎల్‌డీల శుద్ధి కేంద్రం చేరిన వరద నీరు

అప్పీల్‌కు వెళ్లాం

ఎస్‌టీపీ నిర్వహణలో నిర్లక్ష్యంపై రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలని ఎస్ఈ, డీఈఈ, ఏఈఈలకు మెమోలో జారీ చేశాం. మురుగునీరు తుంగభద్రలో కలసి నదీజలాలు కలుషితం అవుతాయని కేసు నమోదుచేసిన ఎన్‌జీటీ రూ.5.20 కోట్లు అపరాధ రుసుం చెల్లించాలని తీర్పు ఇచ్చింది. దీనిపై అప్పీల్‌కు వెళ్లాం. 50 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఎస్‌టీపీలు నిర్మించాల్సి ఉంది. ఉన్నవాటిని సక్రమంగా నిర్వహణ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

● విశ్వనాథ్, కమిషనర్, నగరపాలక సంస్థ, కర్నూలు

ఎస్‌టీపీల నిర్మాణంలో జాప్యం.. కార్పొరేషన్‌కు శాపం

మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్‌టీపీ) నిర్మాణంలో అంతులేని జాప్యం కర్నూలు కార్పొరేషన్‌కు శాపంగా మారింది. ఓల్డ్ పంప్‌హౌస్, సంకల్‌బాగ్, హంద్రీ నది దగ్గర ఏర్పాటుచేసిన మూడు ఎస్‌టీపీ ద్వారా 2.40ఎంఎల్‌డీల మురుగునీరు శుద్ధి చేయవచ్చు. అవి కూడా సక్రమంగా పని చేయడం లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.9కోట్లతో తుంగభద్రలో హంద్రీ నది కలిసే జోహరాపురం బ్రిడ్జి వద్ద 10 ఎంఎల్‌డీలు, హంద్రీ నదిపై దేవనగర్ వద్ద 2 ఎంఎల్‌డీల సామర్థ్యంలో ఎస్‌టీపీల నిర్మాణం 2018లో చేపట్టారు. ఏళ్లు గడుస్తున్నా అసంపూర్తిగా ఉన్నాయి. గత వైసీపీ హయాంలో నిర్లక్ష్యం శాపంగా మారింది. మరో 35 ఎంఎల్‌డీ సామర్థ్యంలో రాంబోట్ల దేవాలయం సమీపంలో ఎస్‌టీపీలు నిర్మించాలని రూ.79 కోట్లతో పంపిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు.

ఇంజనీర్లకు నోటీసులు జారీ

ఎస్‌టీపీనిర్వహణలో నిర్లక్ష్యం, అసంపూర్తి పనులు చేయడంలో జాప్యంపై నగరపాలక సంస్థ ఎస్ఈ శేషసాయి, డీఈఈ జి. గంగాధర్, ఏఈఈ సీవీఆర్ వైష్ణవిలకు కమిషనర్ విశ్వనాథ్ ఆర్‌సీ నంబరు.543158/2025/సీ1 కింద మెమో జారీ చేశారు. గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన గడువు డిసెంబరుతో ముగుస్తుంది. ప్రజారోగ్య (పబ్లిక్ హెల్త్) విభాగం సంకల్‌బాగ్ వద్ద 0.8ఎంఎల్‌డీ, జమ్మిచెట్టు వద్ద 0.8 ఎంఎల్‌డీ, తుంగభద్ర పాత పంప్ హౌస్ వద్ద 0.8 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఎస్‌టీపీలు నిర్మించి 2022లో కార్పొరేషన్‌కు అప్ప గించింది. సంకల్‌బాగ్ వద్ద ఉన్న ఎస్‌టీపీ తప్పా మిగిలిన రెండు ఎస్‌టీపీలు పని చేయడం లేదు. వాటిని వినియోగంలోకి తీసుకురావడానికి ఎందుకు చర్యలు తీసుకోలేదు..? గ్రీన్ ట్రిబ్యునల్ తుది ఉత్తర్వుల గడువు ముగుస్తుందని, ఆ తర్వాత భారీ జరిమానా చెల్లించిం చాల్సి వస్తుందనే విషయం కూడా తెలిసి ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారు..? రాతపూర్వకంగా వివరణ కోరుతూ వారిని మెమో జారీ చేయడం కార్పొరేషన్‌లో చర్చగా మారింది.

శ్రీశైలానికి భారీ వరద



పదిగేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల

నంద్యాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం భారీగా కొనసాగుతోంది. దీంతో శ్రీశైలం జలాశయం 10 రేడియల్ క్రస్ట్ గేట్లను 18 అడుగుల మేర పైకి ఎత్తి స్పిల్‌వే ద్వారా 4,20,370 క్యూసెక్కులు, శ్రీశైలం కుడి, ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 65,065 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల నుంచి 5,21601 క్యూసెక్కుల వరద శ్రీశైలం ప్రాజెక్టుకు చేరుతోంది. గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైలం జలాశయం నీటిమట్టం 881.90 అడుగులు, నీటినిల్వ 198.3623 టీఎంసీలుగా నమోదైంది.

ప్రమాదకర కుంట



పాఠశాల ఆవరణలో తవ్విన కుంట

పాఠశాలల్లో వైసీపీ హయాంలో 'నాడు-నేడు' పనుల కింద ఓ పెద్ద కుంటను తవ్వారు. ఈకుంటతో ప్రమాదం పొంచి ఉంది. హాలహర్వి మండలంలోని గూళ్యంలో పాఠశాలలో సుమారు వెయ్యి మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆ పాఠశాల ఆవరణలోనే కుంట ఉంది. ఆడుకునేందుకు పిల్లలు అటుగా వెళ్తుంటారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయాందోళనకు గురి అవుతున్నారు. పాఠశాల ఆవరణలో తవ్విన కుంటను వెంటనే పూడ్చాలని పలువురు కోరుతున్నారు.

● హాలహర్వి, ఆంధ్రజ్యోతి

కమనీయం.. ఉమామహేశ్వరస్వామి కల్యాణం



యాగంటిలో ఉమామహేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బనగానపల్లె, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటి క్షేత్రంలో ఉమామహేశ్వరస్వామి కల్యాణం గురువారం అంగరంగ వైభవనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఉమామహేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా ఈ వేడుకలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఈవో పాండురంగారెడ్డి, కుమార స్వామిరెడ్డి, దంపతులు, మౌళీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారాలు తగవు

- సున్నిపెంట టీడీపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నంద్యాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఫారెస్టు అధికారులపై శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి దాడి చేశారని జరుగుతున్న తప్పుడు ప్రచారం మానుకోవాలని టీడీపీ నాయకులు అన్నారు. గురువారం సున్నిపెంట టీడీపీ కార్యాలయంలో స్థానిక టీడీపీ నాయకులు సుబ్బారెడ్డి, ఉమామహేశ్వరరావు, మైనార్టీ సెల్ అధ్యక్షులు మహ్మద్‌హుస్సేన్, గ్రామ కమిటి అధ్యక్షులు సుభాన్‌లు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫారెస్టు అధికారులు వాస్తవాలను వక్రీకరిస్తున్నారన్నారు. శిఖరం చెక్‌పోస్టు వద్ద ఫారెస్టు సిబ్బంది, యాత్రికుల మధ్య జరుగుతున్న గొడవను చూసి అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే వాహనం ఆపి ఇరువురికి సర్దిచెప్పి పంపించే ప్రయత్నం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడుసుమల్లి సుబ్బారావు, నాగెల్ల నాగేశ్వరరావు, నజీర్, మైలా శ్రీను, సామేల్, పోలయ్య, జావిద్, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆశలు ఇక సమాధికే..
సాయి కిరణ్ మృతదేహానికి అంత్యక్రియలు

చిగిలి గుండె పగిలి

(5వ పేజీ తరువాయి)

యథావిధిగా పాఠశాలకు వెళ్లి సాయంత్రం మూడున్నర గంటలకు పాఠశాల వదలడంతో ఇంటికి వెళ్లిపోయారు. తిరిగి స్నేహితులంతా ఒక్కటై గ్రామానికి కిలోమీటరు దూరంలో ఉన్న నీటికుంటలో ఈతకొడుతూ ప్రమాదవశాత్తు మృత్యువాత పడ్డారు. ఈ విషాద ఘటనతో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు నాయకులు, పాలకులు, అధికారులు స్పందించి గ్రామానికి చేరుకుని బాధితా కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు.

దేవుడా.. ఎంతపని చేశావయ్యా!

'ఒక్కగానొక్క కొడుకు ఎంతో గారాబంగా చూసుకున్నాము. బాగా చదివించి ప్రయోజకుడిని చేయాలనుకున్నాం. ఇంతలోనే మా కుటుంబాలనే నీట ముంచావు కదా దేవుడా. చివరకు మా కుటుంబాలకు వారసత్వాలు లేకుండా చేశావు' అంటూ భీమేష్, సాయికిరణ్, మహబూబ్‌బాషా తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. ఏ తప్పు చేశామని ఇంత శిక్ష వేశావయ్యా.. మగదిక్కు లేకుండా చేశావు స్వామీ అంటూ వారు ఆ బిడ్డలను పట్టుకుని బోరుమన్నారు.

అధికారులు, నేతల పరామర్శ

ఆరుగురు విద్యార్థులు మృతి చెందిన విషయం తెలిసి జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, ఆలూరు టీడీపీ నేత వీరభద్రగౌడ్, ఆదోని జనసేన నేత మల్లప్ప, వైసీపీ జిల్లా మహిళా నాయకురాలు శశికళ తదితరులు చిన్నారుల కుటుంబాల వద్దకు వెళ్లి, మృతులకు పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబాలను ఓదార్చారు. టీడీపీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్, కోట్ల సుజాతమ్మలు ఒక్కొక్క కుటుంబానికి విడివిడిగా రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.



సాయీ.. మళ్లీ ఎప్పుడు వస్తావ్ రా..
కన్నీటి పర్యంతమవుతున్న తల్లి మమత



రేపటి నుంచి మీరు రారా..?

చిన్నారులు చదివే పాఠశాల ఇది..
(ఒకేరోజు ఆరుగురు విద్యార్థులు చనిపోవడంతో సంతాపసూచికంగా పాఠశాలకు సెలవు ఇచ్చారు)

కుటుంబాలను మింగిన నీటికుంట

రాజకీయ నాయకుల స్వార్థం కోసం తవ్విన నీటికుంట ఒకేసారి ఆరు కుటుంబాలను మింగేసిందని చిన్నారుల తల్లిదండ్రులు బోరుమన్నారు. ఇలాంటి సంఘటన శత్రువులకైనా రాకూడదని గుండెలవిసేలా విలపించారు. 'నాన్న లేరా... బుజ్జికొండ ఒక్కసారి చూడు రా... పెద్దపెద్ద రాజకీయ నాయకులు వచ్చారురా.. నీకు పూలదండలు తెచ్చారు లేరా... మీసారు వాళ్లు వచ్చారు. లే కన్నా... లే... చుట్టాలు వచ్చారు.. ఒక్కసారి చూడు నాన్న' అంటూ ఆ చిన్నారుల తల్లిదండ్రులు గుండె పగిలేలా రోదించిన తీరు కలచివేసింది.



ఇక సెలవ్.. చిన్నారులు కిన్నెరసాయి, శశికుమార్‌ల అంతిమయాత్ర

ఆ ముగ్గురూ ఒకే చోట..



మృత్యువులోనూ కలిసే..
అన్నదమ్ములను సమాధి చేస్తున్న బంధువులు

కిన్నెరసాయి, శశికుమార్ అన్నదమ్ములే కాదు. ఒకే వయసుతో ఉన్న స్నేహితులు కూడా. వీరికి సాయి కిరణ్ తోడుగా మంచి స్నేహితులు. రోజూ ఒకరినొకరు ప్రేమగా తిట్టుకుంటూ, మళ్లీ ఒక్కటవుతూ స్నేహబంధాన్ని బలపరుచుకున్నారే తప్పా ఏనాడూ విడిగా వెళ్లింది లేదు. అందరూ కలసి స్కూల్‌కు వెళ్లేవారు, వచ్చేవారు. అన్నింటా కలసిమెలసి ఉన్న ఆముగ్గురూ మృత్యువులోనూ ఒక్కటిగానే వెళ్లారు. ఆ ముగ్గురిని కుటుంబ సభ్యులు ఒకే చోట ఖననం చేశారు. గ్రామ శివారులోని మఠంకొండ శ్మశాన వాటికలో ఒకేచోట అంత్యక్రియలు నిర్వహించారు. కడసారిచూపు కావడంతో గ్రామ ప్రజలంతా కుల, మతాలకు అతీతంగా.. మూఢ నమ్మకాలను పక్కనపెట్టి 'అయ్యో పాపం' అంటూ చిన్నారులను చూసేందుకు తరలివచ్చారు.



అన్నా మేమున్నాం, ఏడవవద్దు..
పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ



అంతులేని విషాదం..
మహబూబ్‌బాషా డోలిని మోస్తున్న బంధువులు



అప్పుడే నూరేళ్లు నిండాయా?
సాయికిరణ్ మృతదేహంతో బంధువులు



దుఃఖం భరించలేను తల్లీ..

అంతిమయాత్రలో ఆర్తనాదాలు

గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆరుగురు చిన్నారుల అంతిమయాత్ర ప్రారంభమైంది. ఈ అంతిమయాత్రలో ఆయా ప్రాంతాల్లో ఉన్న బంధువర్గం, స్నేహితులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఒకేసారి ఆరుగురు చిన్నారుల అంతిమయాత్ర గ్రామంలో ప్రారంభం కావడంతో ప్రతి ఒక్కరూ బరువెక్కిన హృదయంతో శ్మశానం వైపు అడుగులు వేశారు. ఊరు ఊరంతా పనులన్నీ ఆపేసి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఎటు చూసినా విషాదఛాయలు అలుముకున్నాయి. ఎవరిని కదిలించినా వారు కన్నీటిపర్యంతమవుతూనే కనిపించారు. పసికందులు కాకుండా మమ్మల్ని అయినా తీసుకెళ్లకూడదా దేవుడా ఎంత పనిచేశావు నువ్వు అంటూ వృద్ధులు సైతం కంటతడి పెట్టారు.

ఎస్సార్బీసీలో యువకుడి గల్లంతు

పాణ్యం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పాణ్యం సమీపంలోని ఎస్సార్బీ(శ్రీశైలం రైట్ బ్రాంచ్ కెనాల్)లో పడి ఓ యువకుడు గల్లంతు అయ్యాడు. ఈ ఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకున్నట్లు ఏఎస్‌ఐ రఫీక్ తెలిపారు. వివరాలు.. బేతంచర్ల మండలం గోర్విమానుకొండకి చెందిన జగదీశ్ (22) తన బంధువులతో కలిసి నంద్యాల నుంచి గ్రామానికి వస్తున్నాడు. పాణ్యం వద్ద ఎస్సార్బీసీలో స్నానం చేయడానికి మరో యువకుడితో పాటు కెనాల్‌లో దిగాడు. నీటి ప్రవాహానికి ఇద్దరు కాలుజారి పడిపోయారు. ఈ ఘటనలో ఒక యువకుడిని సమీపంలోని కొందరు వ్యక్తులు తాడు వేసి కాపాడారు. జగదీశ్ నీటి ఉధృతికి కొట్టుకుపోయాడు. యువకుడి జాడకోసం పోలీసులు గాలిస్తున్నారు.

గొలుసు దొంగ హల్‌చల్?

కర్నూలు క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో బాలాజీ నగర్‌లో గొలుసు దొంగ హల్‌చల్ చేశాడు.



మంజుల అనే మహిళ మెడలో నుంచి గొలుసు తెంపుకుని ఉడాయించినట్లుగా సమాచారం. తన ఇంటి ముందు ఉండగా.. ఓ ఆగంతకుడు వచ్చి తనను లోపలికి తోసేసి ఓ స్టోర్ రూములో కట్టేసి మెడలో గొలుసు తెంపుకుని ఉడాయించినట్లుగా బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సాయంత్రం ఇంటికి వచ్చిన భర్త నరసింహులు విడిపించాడని, ఈ ఘటనపై పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సంఘటనా స్థలానికి చేరుకుని విచారిస్తున్నట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

కుక్కదాడి.. నలుగురికి గాయాలు

చాగలమర్రి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.వనిపెంట గ్రామంలో గురువారం కుక్క దాడిలో నలుగురు గాయపడ్డారు. గ్రామంలోని ప్రణయ్, రాఘవ, బాలయ్య, ప్రనితలకు రక్త గాయాలు కావడంత చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలివెళ్లారు. కుక్క స్వైరవిహారం చేసి నలుగురిని గాయపరచడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గ్రామంలో కుక్కలు అధికంగా సంచరిస్తున్నాయని, వాటి నుంచి కాపాడాలని అధికారులకు గ్రామస్థులు కోరారు.

మొబైల్ క్యాంటీన్‌లో గ్యాస్ లీక్

- ఇరువురికి గాయాలు, కర్నూలుకు తరలింపు

వెల్దుర్తి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మొబైల్ క్యాంటీన్‌లో గ్యాస్ లీకయి మంటలు చెలరేగి, ఇద్దరు గాయపడ్డారు. వివరాల మేరకు.. వెల్దుర్తికి చెందిన దంపతులు ఏసురాజు, సుకన్య వెల్దుర్తి సమీపంలోని జాతీయ రహదారి -44 ఈద్గా వద్ద మొబైల్ క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం పనిచేస్తుండగా ఒక్కసారిగా గ్యాస్ లీకయి మంటలు చెలరేగి నిర్వాహకులు ఏసురాజు, సుకన్య గాయపడ్డారు. స్థానికులు అంబులెన్స్‌లో వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించారు. వారి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు



సిమెంట్ కంటైనర్ ఢీకొని నుజ్జునుజ్జయిన ట్రాక్టర్

కొలిమిగుండ్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలివీ.. కొలిమిగుండ్ల అంబేడ్కర్ సర్కిల్ సమీపంలో ఎన్‌హెచ్-544డి రహదారిపై గురువారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. కొలిమిగుండ్ల నుంచి ఇటిక్యాలకు తిరిగి వెళ్తున్న ట్రాక్టర్‌ను మలుపు వద్ద ఎదురుగా వస్తున్న సిమెంట్ కంటైనర్ ఢీకొట్టడంతో ట్రాక్టర్ ఇంజన్ నుజ్జునుజ్జయింది. ఈప్రమాదంలో ఇటిక్యాలకు చెందిన డ్రైవర్ వెంకటేశ్వర్లుకు తీవ్రగాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో తాడిపత్రికి తరలించారు. దీంతో ట్రాఫిక్ నిలిచిపోగా, పోలీసులు రాకపోకలను పునరుద్ధరించారు. అలాగే కొలిమిగుండ్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఓ వాహనం, బైకు ఢీకొన్న ఘటనలో భాస్కర్ అనే యువకుడికి గాయాలయ్యాయి. బైకుపై మోడల్‌స్కూల్ వైపు నుంచి వస్తున్న భాస్కర్‌ను వాహనం ఢీకొట్టింది.

సీసీఐ సీఐపై కేసు

- భార్య ఉండగానే రెండో పెళ్లి
- ఫిర్యాదు చేయడానికి వచ్చిన మహిళతో వివాహం
- రెండో భార్య మొదటి భర్త పవన్‌కుమార్ ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన మదనపల్లి పోలీసులు



సురేశ్ కుమార్

నంద్యాల టౌన్, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): నంద్యాల సీసీఎస్‌లో పనిచేస్తున్న సీఐ సురేశ్ కుమార్‌పై భార్య ఉండగానే రెండో పెళ్లి చేసుకోవడంపై మదనపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు, బాధితుడు పవన్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పవన్ కుమార్‌కు 2018లో కలికిరికి చెందిన సరితతో పెళ్లి జరిగింది. కొన్ని సమస్యల వల్ల విడిపోయి స్థానికంగా సరిత ఫిర్యాదు చేసింది. 2021లో సరిత మదనపల్లి డీఎస్పీ కార్యాలయానికి కేసు పని మీద వచ్చింది. అదే సమయంలో మొలకల చెరువులో సీఐగా పనిచేస్తున్న సురేశ్‌కుమార్ డీఎస్పీ కార్యాల యంలో ఆమెను పరిచయం చేసుకున్నాడు. భార్య ఉండగానే నెల లోనే సరితను రెండో పెళ్లి చేసుకు న్నాడు. ఇటీవల ఆమె ఒక బిడ్డకు జన్మనిచ్చింది. సరిత మొదటి భర్త అయిన పవన్‌కుమార్ దీనిపై ఎన్నో సార్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయినా వారు పట్టించుకోలేదు. డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో కోర్టును ఆశ్రయించి ఐదు సార్లు విన్నవించుకున్నాడు. కేవలం చిన్న కేసు కట్టి వదిలేశారు. బాధితుడు ఈ సారి ఏకంగా ప్రధానమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేశాడు. దీంతో స్పందించిన పోలీసుశాఖ సీఐపై విచారణకు ఆదేశించింది. దీంతో ఆ సీఐ గత నెల రోజులకు పైగా ఆరోగ్యం బాగాలేదని సెలవు పెట్టి ఎక్కడికో వెళ్లిపోయాడు.

సీఐ క్యాస్ట్ సర్టిఫికెట్‌పై కూడా విచారణ

సీఐ సురేశ్‌కుమార్ క్యాస్ట్ సర్టిఫికెట్‌పై కడప జిల్లా రెవెన్యూ శాఖ విచారణ చేస్తోంది. సీఐ తండ్రి పేరు సుబ్బారెడ్డి, తల్లి నరస సుబ్బమ్మ. వీరిద్దరు కులాంతర వివాహం చేసుకున్నారు. అయితే తల్లి క్యాస్ట్ మీద సర్టిఫికెట్లు తీసుకుని సీఐ ఉద్యోగంలో చేరాడు. దీనిపై బాధితుడు ఇటీవల పీఎంవోకు ఫిర్యాదు చేయగా విచారణ చేశారు. ప్రతిచోట అతను ఓసీ అని రాసుకుని కేవలం ఉద్యోగం విషయంలో మాత్రమే వేరే క్యాస్ట్(ఎస్సీ) అని రాసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదే క్రమంలో తండ్రి పేరు కూడా సుబ్బారెడ్డి కాస్త సుబ్బయ్యగా మార్చి సర్టిఫికెట్లలోనూ అవకతవకలకు పాల్పడి ఉద్యో గంలో చేరినట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల హైకోర్టుకు హాజరైన సమయంలో కూడా తండ్రి పేరు సుబ్బారెడ్డిగా రాశాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న నాగేంద్రసింగ్

ఆత్మకూరురూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని తోటగేరిలో నాగేంద్ర సింగ్ (42) అనే వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం రాత్రి ఆత్మకూరులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నారాయణ రెడ్డి వివరాల మేరకు... ఆత్మకూరు పట్టణానికి చెందిన నాగేంద్ర సింగ్ ఓ కిరాణాదుకాణంలో గుమాస్తాగా పని చేస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసైన నాగేంద్రసింగ్ తరచూ కడుపు నొప్పితో బాధ పడుతుండేవాడు. కడుపునొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమా చారం మేరకు ఎస్‌ఐ నారాయణరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రిటైర్డ్ ఉద్యోగి ప్రాణాలు కాపాడిన పోలీస్

- అత్యవసర పరిస్థితిలో సీపీఆర్ చేసిన హెడ్ కానిస్టేబుల్



సీపీఆర్ చేస్తున్న కోదండరామిరెడ్డి

ఎమ్మిగనూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): టిఫిన్ సెంటర్‌లో ఓ రిటైర్డ్ ఉద్యోగి ఆకస్మాత్తుగా కుప్పకూలి పడిపోగా అదే సమయంలో అక్కడికి వచ్చిన నందవరం హెడ్ కానిస్టేబుల్ కొండడరామిరెడ్డి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన సంఘటన గురువారం ఎమ్మిగనూరులో చోటుచేసుకుంది. పట్టణంలోని ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఉద్యోగి రాజశేఖర్ అల్పాహారం చేసేందుకు పెద్దబావి ప్రాంతంలో ఉన్న అమరావతి టిఫిన్ సెంటర్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో ఉన్నట్టుండి స్పృహ తప్పి కుప్పకూలాడు. మూర్ఛవచ్చిందని స్థానికులు చేతిలో తాళాలు పట్టించారు. ఇదే సమయంలో టిఫిన్ సెంటర్‌కు వచ్చిన కోదండరామిరెడ్డి అందరిని పక్కకు జరిపి బాధితుడి ఛాతీపై 10 నిమిషాలు సీపీఆర్ చేశాడు. దీంతో రాజశేఖర్ లేచి కూర్చున్నాడు. తేరుకున్నాక మరో సారి కళ్లుతిరిగి కిందకు పడిపోయాడు. దీంతో గుండెపోటు అని గుర్తించిన ఏఎస్‌ఐ వెంటనే అంబులెన్స్‌కు ఫోన్‌చేసి మరోసారి సీపీఆర్ చేశాడు. బాధితుడు స్పృహలోకి రావటంతో అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చేరుకుని వైద్యుల సూచనమేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. ప్రస్తుతం రాజశేఖర్ ఆరోగ్యం నిలకడగా ఉంది. కాగా సకాలంలో సీపీఆర్ చేసిన నందవరంహెడ్ కానిస్టేబుల్‌ను పలువురు అభినందించారు.

ఘనంగా పెద్దరాజు స్వామి ఉరుసు

- మేళతాళాలతో గంధం ఊరేగింపు
- ఆకట్టుకున్న ఫకీరుల విన్యాసాలు
- తరలివచ్చిన భక్తులు



ఊరేగింపుగా వస్తున్న దర్గా పీఠాధిపతి గురు సయ్యద్ అక్బర్‌బాషా ఖాద్రి

బేతంచెర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూటుపల్లెలో వెలసిన సయ్యద్ షా అబ్దుల్ రెహిమాన్ ఇద్రుస్‌బాషా ఖాద్రి ఉరఫ్ పెద్దరాజు స్వామి ఉరుసు గురువారం ఘనంగా నిర్వహించారు. దర్గా పీఠాధిపతి సయ్యద్ అక్బర్ బాషా ఖాద్రి ఇంటి నుంచి బుధవారం తెల్లవారుజామున గంధం సయ్యద్ అక్బర్‌బాషా కాద్రి గుర్రంపై గ్రామ వీధుల గుండా మేళతాళాలతో ఫకీరుల విన్యాసాలతో ఊరేగింపు వస్తూ గంధం దర్గాకు చేరుకుంది. గంధం పెద్దరాజు స్వామికి సమర్పించి ఫతేహాల్ చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఫకీరులు విన్యాసాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ ఉరుసుకు మహారాష్ట్ర నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ రమేష్‌బాబు గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఎమ్మెల్యే కోట్ల, కేఈ ప్రత్యేక ప్రార్థనలు

గూటుపల్లె పెద్దరాజు స్వామివారిని దర్గాను ఎమ్మెల్యేలు కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, కేఈ ప్రతాప్ రెడ్డి దర్శించుకున్నారు. దర్గా పీఠాధిపతి అక్బర్ బాషా ఖాద్రి ఎమ్మెల్యేతో ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, గ్రామ నాయకులు ముల్లా, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



ఫకీరుల విన్యాసాలు



దర్గాను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కోట్ల

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

మహిళలకు గోధుమలతో ఒడిబియ్యం కార్యక్రమం



నంద్యాల కల్చరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నంద్యాలలో ఉన్న ఆయుష్ యోగా కేంద్రంలో గురువారం శ్రావణ మాసం పుష్యమి నక్షత్రం సందర్భంగా సంతాన ప్రాప్తికి గోధుమలతో ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుష్ యోగా మహిళా విభాగం నిర్వాహకురాలు సులోచన మాట్లాడుతూ భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని 19 మంది మహిళలకు సామూహికంగా గోధుమలతో ఒడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించామని ఈ సందర్భంగా వారు వివరించారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న నాగరాజు

నంద్యాల రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఆటో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆటోవర్కర్స్ యూనియన్ జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటోలకు బాడుగలు లేక డ్రైవర్లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, వాహనమిత్ర పథకం ద్వారా రూ.25 వేలు ఇవ్వాలని కోరారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, రమేష్‌బాబు, ఓబులేసు, నాగేంద్ర, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు సింగిల్‌విండో ఛైర్మన్ ప్రమాణస్వీకారం

జూపాడుబంగ్లా, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): 80బన్నూరు సహకార సొసైటీ ఛైర్మన్‌గా పిక్కిలి శ్రీనివాసులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సీఈవో చంద్రశేఖర్‌గౌడు తెలిపారు. ముఖ్యఅతిథులుగా నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నంద్యాల పార్లమెంటు ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి హాజరవుతారన్నారు. ఛైర్మన్‌తో పాటు ఇద్దరు డైరెక్టర్లు కూడా ప్రమాణం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతు సోదరులందరూ హాజరు కావాలని కోరారు.

రోడ్డుపై నాట్లు వేసి సీపీఎం నిరసన



కొణిదేలలో రోడ్డుపై నీళ్లలో నాటు వేసి నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు రూరల్, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మండలంలోని కొణిదేల గ్రామంలో వర్షాలకు ప్రధాన రహదారుల్లోని గుంతల్లో నీరు నిల్వచేరాయి. ఈ గుంతల్లో గురువారం సీపీఎం నాయకులు పక్కీర్‌సాహెబ్, గోపాలక్రిష్ణ కార్యకర్తలు, గ్రామస్థులతో కలిసి నాట్లు వేసి నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంటనే రోడ్ల మరమ్మతులు చేపపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు లక్ష్మన్న, నాగేంద్ర, బండి శేషన్న, హను మంతు, మద్దిలేటి గౌడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న దివ్యాంగులు

నందికొట్కూరు రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల సమస్యలను పరిష్కరిస్తామని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య తెలిపారు. గురువారం నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి స్వగృహంలో దివ్యాంగుల రాష్ట్ర పోరాట సమితి నాయకులు, దివ్యాంగులు కలిసి ఎమ్మెల్యే జయసూర్యకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంఘం జిల్లా నాయకుడు నాగన్న మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు తొలగించిన పింఛన్లు, అలాగే సదరం సర్టిఫికెట్స్, సెప్టెంబరు నెల ఎన్‌టీఆర్ పింఛన్లను తిరిగి పంపిణీ చేయాలని కోరారు. దివ్యాంగుల సంఘం నాయకులు చంద్రశేఖర్, శేషమ్మ, షేక్షావళి, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

పాములపాడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అక్కడి సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని రాష్ట్ర ప్రభుత్వ అసిస్టెంట్ అకాడమిక్ మానిటరింగ్ అధికారి సలీంబాషా అన్నారు. గురువారం పాములపాడు ఆదర్శ పాఠశాల, కళాశాలలను ఆయన తనిఖీ చేశారు. తరగతి గదుల్లో విద్యార్థులను పాఠ్యాంశాలపై పలు ప్రశ్నలు అడిగారు. అందరికీ యూనిఫాం, పుస్తకాలు ఇచ్చారా.. అని ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నాగరవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

26న మెగా న్యాయ విజ్ఞాన సదస్సు

ఆత్మకూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో ఈ నెల 26న కొట్టాలచెరువు గ్రామంలో మెగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ లీలా వెంకట శేషాద్రి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. కొట్టాలచెరువు గ్రామంలో ఈనెల 26న జరిగే ఈ కార్యక్రమంలో చెంచు గిరిజనులకు చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు పథకాల గురించి వివరించనున్నట్లు పేర్కొన్నారు.

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

● పలు ప్రాంతాల్లో ధర్నాలు.. వినతిపత్రాల అందజేత



మహానందిలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

పాణ్యం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దారు కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలలో భాగంగా ఇచ్చిన అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలన్నారు. రకరకాల యాప్‌లు లేకుండా ఒకే యాప్‌ను అమలు చేస్తామని, రిటైర్డ్ బెనిఫిట్స్ అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఫేస్ యాప్, ఎఫ్ఆర్ఎస్ యాప్ వంటి రకరకాల యాప్‌లతో అంగన్‌వాడీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. యువగళం పాద యాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన వేతన పెంపు, ప్రమోషన్‌ల ఊసే లేదన్నారు. అర్హులైన వారికి రెండు ప్రమోషన్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిటీ శివ ప్రసాద రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సంఘాల నాయకురాళ్లు వెంకటమ్మ, మాబున్నీసా, మరియమ్మ, స్వరూప, వసంత వివిధ గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా : అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం నాయకులు కర్ణ, రాము, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు ప్రసన్న, జయమ్మ, రామతులసి, వెంకటరమణమ్మ అన్నారు. రాష్ట్రకమిటీ పిలుపు మేరకు జూపాడుబంగ్లాలోని కర్నూలు-గుంటూరు రహదారిపై అంగన్‌వాడీలు రాస్తారోకో నిర్వహించారు. వెంటనే సమస్యలు పరిష్కరించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

ఆత్మకూరు: అంగన్‌వాడీలకు వేతనాలను పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సద్దాం, రామ్‌నాయక్, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు లక్ష్మీదేవీ, మంజుల పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని, గ్రాడ్యూటీ జీవోలో మార్పులు చేయాలన్నారు. అనంతరం ఐసీడీఎస్ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఆ సంఘం నాయకులు రణధీర్, ప్రమీలమ్మ, అరుణ, వాణి, సుజాత, కుమారీబాయి, మహేశ్వరీ, వెంకటలక్ష్మి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కారించాలనికోరుతూ పగిడ్యాల తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు కుర్షిద్‌బీ, ప్రభావతి మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారంలో పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. అంగన్‌వాడీ టీచర్లు సాజీదాబేగం, రాములమ్మ, అనురాధ, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

గోస్పాడు: అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్‌ను రద్దుచేయాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా బ్లాక్‌డేలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రైతుసంఘం నాయకుడు మార్క్, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

మహానంది: ప్రభుత్వం తమకు వేతనాలు పెంచడంతో పాటు ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని రద్దు చేయాలని మండల అంగన్‌వాడీ టీచర్లు గురువారం సాయంత్రం మహానంది తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు.

మండల యూనియన్ నాయకులు సావిత్రి, నారాయణమ్మ ఆధ్వర్యంలో గంటపాటు తమ సయస్యలపై ధర్నా నిర్వహించి, బ్లాక్‌డే పాటించారు. వీరికి మద్దతుగా సీఐటీయూ నాయకులు ఏసురత్నం, నాగరాజు తదితరులు పాల్గొని వినతిపత్రం అందజేశారు.

నందికొట్కూరు రూరల్: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ నాయకులు గోపాల క్రిష్ణ, మదార్‌బీ, అంగన్ వాడీల యూనియన్ నాయకురాలు శైలజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నందికొట్కూరు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. నాయకులు లక్ష్మి, పద్మావతి, కీర్తి, సత్యవతీ తదితరులు పాల్గొన్నారు.



పాణ్యం: వినతి పత్రం అందజేస్తున్న నాయకులు



జూపాడుబంగ్లా: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



ఆత్మకూరు: ఐసీడీఎస్ అధికారులకు వినతిపత్రాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీలు



నందికొట్కూరు: సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన

అడవి పందుల నుంచి పంటలను రక్షించండి

ఆత్మకూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలో అడవి పందుల నుంచి పంటలను రక్షించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి స్వాములు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్ అబ్దుల్ రఫూఫ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు, వెలుగోడు మండలాల్లోని అనేక గ్రామాల్లో సాగు చేసిన మొక్కజొన్న, మినుము, వేరుశనగ, కంది, వరి, సోయాబీన్, జొన్న పంటలను అడవి పందులు నాశనం చేస్తున్నాయని వివరించారు. వాటిని అరికట్టే చర్యలకు రైతులు పాల్పడితే అటవీ అధికారులు కేసులు నమోదు చేస్తున్నారన్నారు. అడవి జంతువుల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేల నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పంట పొలాల్లోకి వన్యప్రాణులు రాకుండా అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



ఆత్మకూరులో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఆత్మకూరురూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) :ఆత్మకూరు మండలంలో గత ఐదు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, పత్తి పంటలను నంద్యాల ప్రాంతీయ పరిశోధనా శాస్త్రవేత్తలు అశోక్‌కుమార్, పుల్లిబాయ్, నసిరుద్దీన్ గురువారం పరిశీలించారు. ఈ మేరకు మండలంలోని కరివేన, నల్లకాలువ తదితర గ్రామాల్లో సహాయ వ్యవసాయ సంచాలకులు హేమలతతో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలోని రైతులు పంట పొలాల్లో నిలిచిన నీటిని తొలగించాలని సూచించారు. రెండు రోజుల కంటే ఎక్కువగా పొలాల్లో నీరు నిలిస్తే పంట నష్ట తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. ఎంపీఈవో సతీష్, రవి,వీఏఏ అశోక్ పాల్గొన్నారు.

పాములపాడు :వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంటను శాస్త్రవేత్తలు అశోక్, పుల్లిబాయి, నసిరుద్దీన్ స్థానిక వ్యవసాయశాఖ అధికారి మహేశ్వరరెడ్డి పరిశీలించారు. గురువారం చెలిమిల్ల, పాములపాడు, ఇస్కాల గ్రామాలలో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 375 ఎకరాల్లో పంట దెబ్బతిందని ప్రాథమిక అంచన వేశారని, కానీ ఎక్కువ శాతం పంట దెబ్బతిందని తెలిపారు. నష్టపోయిన రైతులకు పంటనష్టం అంచనా వేసేందుకు సిబ్బంది పొలాలకు వద్దకు వస్తారని, పూర్తి వివరాలు తెలపాలని పేర్కొన్నారు. రైతులకు మేలు జరిగేలా చూస్తామన్నారు.

సరస్వతీ అమ్మవారికి వెండి హారం సమర్పణ




కొలనుభారతి అమ్మవారికి వెండి హారాన్ని అందజేస్తున్న సంజీవరెడ్డి దంపతులు

కొత్తపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని కొలనుభారతి క్షేత్రంలో కొలువైన జ్ఞాన సరస్వతి అమ్మవారికి భక్తులు వెండి హారాన్ని సమర్పించారు. గురువారం నందికొట్కూరుకు చెందిన ఎద్దుల సంజీవరెడ్డి, మహేశ్వరమ్మ దంపతులు రూ.8వేలు విలువ గల ఏడున్నర తులాల వెండి హారాన్ని స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్ సమక్షంలో ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మకు అందజేశారు. వీరితో పురోహితులు కుంకుమార్చన, పుష్పార్చన తదితర పూజలు చేయించి తీర్థప్రసాద వితరణ గావించారు. అలాగే క్షేత్ర ప్రాంగణంలో చిన్నారులకు అక్షర బీజాక్షర క్రతువులు చేయించుకున్నారు.

డేంజర్‌లో దద్దనాల

5వ పేజీ తరువాయి

ప్రాజెక్టుకు ఉన్న రెండు ప్రధాన గేట్లలో ఓగేటు 15ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



నాలుగేళ్ల క్రితం గేట్లకు సంబంధించి..

దద్దనాల ప్రాజెక్టుకు సంబంధించి నాలుగేళ్ల క్రితం ప్రధాన గేట్లు, పూడిక గేట్లు, మరమ్మతులు చేయడానికి ప్రయత్నించారు. ఒక గేటు మాత్రమే మరమ్మతులకు నోచుకుంది. మరో ప్రధాన గేటు మాత్రం నేటికీ మరమ్మతులకు నోచుకోలేదు. అలాగే పూడిక, స్లూయిస్ గేట్లు కూడా మరమ్మతులకు నోచుకోలేదు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 25అడుగులు కాగా 10 అడుగులకు పైగా లోతు ప్రాజెక్టులో పూడికతో నిండిపోయింది.

ఇరవై ఏళ్ల తర్వాత పంట కాల్వలకు..

20 సంవత్సరాల తర్వాత దద్దనాల ప్రాజెక్టు పంట కాల్వలకు మోక్షం లభించింది.

దద్దనాల ప్రాజెక్టు గేట్లు, పూడిక గేట్లు, ఇతర అభివృద్ధి పనులకు రూ.6కోట్లతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించి పూడిక

రూ.6 కోట్లతో ప్రతిపాదనలు

గేట్లు, ప్రధాన గేట్ల మరమ్మతులు చేపట్టి ప్రాజెక్టు పరిధిలోని రైతులకు ఇబ్బందులు లేకుండా చేస్తాం

● రామ్మోహన్‌రెడ్డి, ఏఈ, మైనర్ ఇరిగేషన్, బనగానపల్లె

మరమ్మతులకు నోచుకోని పూడిక గేట్లు

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చొరవ తీసుకొని రూ.10.60లక్షలు నిధులు విడుదల చేయించారు. నాలుగు నెలల క్రితం ఆనిధులతో దద్దనాల ప్రాజెక్టు పంట కాల్వల్లో పూడిక తీత, ముళ్లకంపల తొలగింపు కార్యక్రమం మైనర్ ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టారు.



దద్దనాల ప్రాజెక్టు

మొరాయించిన గేటు..

పది రోజుల క్రితం దద్దనాల ప్రాజెక్టుకు సంబంధించి పనిచేస్తున్న ఒక్క గేటు కూడా మొరాయించింది. ఎట్టకేలకు కర్నూలు నుంచి నిపుణులను రప్పించి మైనర్ ఇరిగేషన్ అధికారులు గేటు యథావిధిగా పనిచేసేలా చర్యలు తీసుకున్నారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

● సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు



జీపుజాతాను ప్రారంభిస్తున్న సీపీఐ నాయకులు

నందికొట్కూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర 28వ మహాసభలు ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలో ఈనెల 23 నుంచి 25 వరకు జరుగుతున్నాయని, విజయవంతం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని పగిడ్యాల, మిడ్తూరు, నందికొట్కూరు పట్టణాల్లో గురువారం ప్రచార జీపుజాతాను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రఘురామమూర్తి, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలను ఎండగడుతూ విద్యా, వైద్యం, పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో 26 జిల్లా సమగ్రాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధ్యాయ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, రోజువారి కూలీల సమస్యలపై విద్యార్థి, యువజన మహిళా, దళిత, మైనార్టీ సమస్యలపై పోరాటం, సమగ్రాభివృద్ధే ధ్యేయంగా ఆగస్టు 23న ఒంగోలు నగరంలో నిర్వహించే సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పగిడ్యాల మండల కార్యదర్శి మజీద్, సిపిఐ నాయకులు సుంకన్న, వెంకటేశ్వర్లు, అబ్దుల్ రహ్మాన్, దివాకర్, రఫి పాల్గొన్నారు.

పగిడ్యాల : ఒంగోలులో ఈ నెల 23వ తేదీ నిర్వహించే సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ నాయకులు రఘురామూర్తి, మండల నాయకుడు మజీద్ పిలుపునిచ్చారు. మహాసభలను విజయవంతం చేయాలని పగిడ్యాలలో గురువారం జీపుజాతా నిర్వహించారు.

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో త్రిఫలవృక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామికి గురువారం భక్తులు విశేషపూజలు నిర్వహించారు. లోకకళ్యాణార్థం ముందుగా గణపతి పూజ నిర్వహించి స్వామికి పంచామృత అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు.

రింగ్ రోడ్డు పనుల పరిశీలన



రింగ్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణం మీదుగా సుమారు రూ.3కోట్ల వ్యయంతో నిర్మించనున్న రింగ్ రోడ్డు నిర్మాణ పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, కో ఆప్షన్ సభ్యుడు ఎం.ఏ.రషీద్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయిబాబా ఆర్చీ ఎదుట ఉన్న కళాంజలి గ్రాఫిక్స్ నుంచి తహసీల్దార్ కార్యాలయం, పాత బస్టాండ్, నేతాజీనగర్, తిక్కయ్య స్వామిదర్గా, తోటగేరి, గాంధీ పార్క్, పెద్దబజారు, గొల్లపేట, కొత్తపేట మీదుగా నంద్యాల టర్నింగ్ వరకు రింగ్ రోడ్డుతో పాటు ఇరువైపులా డ్రైనేజీ కాల్వలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఉన్న 4 మీటర్ల రోడ్డును 7 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నిర్మాణ పనులు పూర్తయితే ఆయా ప్రాంతాల్లో కొంతమేర ట్రాఫిక్ సమస్య తగ్గే అవకాశం ఉంటుందన్నారు.ప్రస్తుతం తొలివిడతగా రూ.1.2కోట్ల నిధులతో తిక్కయ్యస్వామి దర్గా వరకు ఈ పనులను చేపడుతున్నామని, ఆ తర్వాత మరిన్ని నిధులతో పూర్తి చేస్తామన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు :ఆత్మకూరు పట్టణంలోని నంద్యాల రస్తాలో ఉన్న ముస్లిం శ్మశానవాటిలో పిచ్చిమొక్కలు తొలగించినట్లు మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఎం.ఏ.రషీద్ గురువారం తెలిపారు. ఖబరస్తాన్‌లో పరిశుభ్రత చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

పండ్ల మొక్కలు పెంచాలి : పీడీ

బండిఆత్మకూరు ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): రైతులు పండ్ల మొక్కల పెంపకం చేపట్టాలని డ్వామా పీడీ సూర్యనారాయణ సూచించారు. గురువారం మండలంలోని కడమలకాల్వ శివారులో ఉన్న శివనందీశ్వర స్వామి ఆలయ ఆవరణంలో కొబ్బరి, పూల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ లీలావతి, ఏపీఓ వసుధ, డాక్టర్ జ్యోత్స్న, రమణ, భూపాల్, మల్లికార్జున, పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజినాయక్

ఆత్మకూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలను పట్టణ ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, డీఎస్పీ రామాంజినాయక్ కోరారు. ఈ మేరకు గురువారం ఆత్మకూరు పట్టణంలోని ఎంఅండ్ఎం ఫంక్షన్ హాల్‌లో వివిధ మతాల పెద్దలతో పాటు అన్ని గణేశ్ మంటపాల నిర్వాహకులతో శాంతి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. కులమతాలకు అతీతంగా ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలందరు ఉత్సవాలను జరుపుకోవాలని కోరారు. ప్రతి మంటపానికి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. మంటపాలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి అపశ్రుతులకు తావులేకుండా తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. అదేవిధంగా మంటపాల వద్ద నిర్వాహకులు రాత్రింబవళ్లు అందుబాటులో ఉండాలన్నారు. నిమజ్జన వేడుకకు సంబంధించి నిర్దేశించిన సమయానికి శోభాయాత్రను ప్రారంభించాలని సూచించారు. మంటపాలకు సంబంధించిన బాధ్యులు విగ్రహం వద్దే ఉండాలన్నారు. ప్రస్తుతం వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే ఎస్ఆర్ఎంసీ కాల్వలో నీటి ప్రవాహం అధికంగా ఉందని, సాధ్యమైనంతవరకు చిన్నారులకు నిమజ్జన ప్రదేశానికి రానివ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు వ్యవహరించాలన్నారు. ఎప్పటిలాగే ఈసారి కూడా వినాయక చవితిని ప్రశాంతంగా నిర్వహించి మంచిపేరు తీసుకురావాలని కోరారు.

నందికొట్కూరు రూరల్: వినాకచవితి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, బ్రాహ్మణ కొట్కూరు ఎస్ఐ తిరుపాలు వినాయక కమిటీల నాయకులు, సభ్యులకు సూచించారు. గురువారం బ్రాహ్మణకొట్కూరు పోలీస్‌స్టేషన్‌లో వినాయక కమిటీల నాయకులు, సభ్యులు గ్రామస్థులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

వినాయక ఉత్సవాలకు అనుమతి తీసుకోవాలి



సంజామలలో ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ

ఆళ్లగడ్డ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మండపాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని డీఎస్పీ ప్రమోద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్‌లో అనుమతులు పొందవచ్చన్నారు. అనుమతులు పొందడానికి ఎటువంటి రుసులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకొన్న తరువాత సంబధిత పోలీసు అధికారి మండప స్థలాన్ని తనిఖీ చేసి నిబంధలన ప్రకారం ఉంటే క్యూర్ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రాన్ని జారీ చేస్తామని తెలిపారు.

సంజామల: వినాయక నిమజ్జనానికి మూడు రోజులు మాత్రమే అనుమతి ఇస్తున్నట్లు కోవెలకుంట్ల సీఐ హనుమంత నాయక్ ఉత్సవ కమిటీలకు సూచించారు. గురువారం సాయంత్రం సంజామల పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ రమణయ్యలతో కలిసి ఉత్సవ కమిటీలతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఈ ఏడాది గణేష్ ఉత్సవాలకు మూడు రోజులు మాత్రమే అనుమతులు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో కమిటీ బృందం రఘురామయ్య, రాజారెడ్డి, మోహన్, క్రిష్ణమూర్తి, సాగర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

డోన్ రూరల్: ఐదు రోజుల పాటు గణేశ్ ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఈ నెల 27వ తేదీ నుంచి వినాయక ఉత్సవాలు నిర్వహించడానికి గణేశ్ ఉత్సవ కేంద్ర సమితి సభ్యులు సందు వెంకట రమణ, వై.హనుమంతరెడ్డి, బట్టు చక్రి, ఈశ్వర్ నాయుడు, తిమ్మారెడ్డి, శంకర్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు గణేష్ ఉత్సవాల విజయవంతం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు గణేష్ విగ్రహాల అమ్మకాల ప్రదేశాలను గురువారం పరిశీలించారు.

రుద్రవరం: మండలంలోని అన్ని గ్రామల్లో వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ మహ్మద్ రఫీ సూచించారు. గురువారం సాయంత్రం పోలీసుస్టేసన్ ఆవరణంలో పీస్ కమిటి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శిరివెళ్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని శిరివెళ్ల సర్కిల్ సీఐ దస్తగిరిబాబు సూచించారు. శిరివెళ్లలోని పోలీసు స్టేషన్‌లో గురువారం పీస్ కమిటీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విగ్రహాల ఏర్పాటు, నిమజ్జనం సమయాల్లో కమిటీ సభ్యులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశ్విన్‌కుమార్, విద్యుత్‌శాఖ ఇన్‌చార్జి ఏఈ మల్లికార్జున, విశ్వహిందూపరిషత్ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు వైపీ రామయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: త్వరలో జరగబోయే గణేశ్ నిమజ్జన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను సీఐ హనుమంతనాయక్, తహసీల్దారు పవనకుమార్ రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. కోవెలకుంట్ల మండలంలోని పలు గ్రామాల్లో వినాయకచవితి పండుగను పురస్కరించుకుని నిర్వహించే గణేశ్ నిమజ్జనం కార్యక్రమానికి ఏర్పాట్లను పరిశీలించామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఉయ్యాలవాడ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 11మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 12,800 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ తమకు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసినట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

చవితి పుస్తకాల ఆవిష్కరణ

చాగలమర్రి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో వినాయక చవితి సందర్భంగా ఉత్సవాల పుస్తకాలను ఆలయ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, యువజన సంఘం అధ్యక్షుడు వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఈ ఏడాది 5 రోజుల పాటు వినాయకచవితి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విగ్రహాలను మండపాల్లో ప్రతిష్ఠించి 5 రోజుల పాటు వినాయకుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామని అన్నారు. మండపాల వద్ద వివిధ సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ ధర్మకర్త లక్ష్మణబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం

బేతంచెర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ శేషారెడ్డి సామాజిక ఆరోగ్య కేంద్రంలోని గర్భిణులకు, రోగులకు పట్టణానికి చెందిన పద్మనాభం యాదవ్ సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్యులు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సురా మధు సుధాకర్ రెడ్డి, జయకృష్ణ, సాంబశివారెడ్డి, వెంకటేశ్వర్లు వలిబాషా, మనోహర్ రెడ్డి, రామకృష్ణ, తిరుమలేష్ ఆసుపత్రి సిబ్బంది రోగులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- అధికారులకు అంగన్‌వాడీల వినతి
- నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాలు ఉధృతం
- కార్మిక సంఘాల హెచ్చరిక

డోన్ రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వం విస్మరిస్తే ఉద్యమాలు తీవ్ర తరం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జులేఖ హెచ్చరించారు. గురువారం డోన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, అనుబంధ సంఘాల నాయకులు నక్కి శ్రీకాంత్, సుమలత, రెహిమత్‌బీ, స్వర్ణలత, మల్లిక, తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరారు. గురువారం తహసీల్దారు సువర్ణదేవికి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఎన్నో ఎళ్లుగా ప్రభుత్వం తమ జీతాలు పెంచటం లేదన్నారు. ఎఫ్ఆర్సీని వెంటనే రద్దు చేయాలన్నారు. గ్రాట్యూటీతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రాజేశ్వరి, ఫక్రుబీ, గురులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి: యాప్‌ల భారంతో పని ఒత్తిడి పెరిగిందని, ఆ భారాన్ని తగ్గించాలని అంగన్‌వాడీలు, హెల్పర్లు కోరారు. గురువారం తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ప్యాపిలి: అంగనవాడీ వర్కర్ల వేతనాలు పెంచాలని ఆ వర్కర్ల సంఘం జిల్లా కోశాధికారి ఎస్తేరమ్మ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక రెవెన్యు కార్యాలయం ఎదుట అంగవాడీ వర్కర్లు ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దారు భారతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వర్కర్లు నాగేంద్రమ్మ, అరుణ, నీరజ, విజయకుమారి, సుధ, పరిమిళ పాల్గొన్నారు.

శిరివెళ్ల: అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బందికి పని భారం తగ్గించాలని కార్యకర్తలు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ విజయశ్రీకి గురువారం వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు 2019 నుంచి వేతనాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బేతంచెర్ల: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ సమస్యలను తక్షణమే పరిష్కరిస్తూ వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి షేబారాణి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. గురువారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ మారుతికి వినతి పత్రం అందజే శారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు కార్యకర్తలు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం అమలు చేయాలని సీపీఎం నాయకుడు దావీదు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రమైన కొలిమిగుండ్లలో సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తూ, మానవహారం ఏర్పాటు చేశారు. సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు భాగ్యలక్ష్మి, లక్ష్మీనరసమ్మ, వసుంధర, రామేశ్వరి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



డోన్ ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



ఉయ్యాలవాడలో తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు



బేతంచెర్లలో..

నెలాఖరులోపు సర్వే పూర్తి చేయాలి: డీడీ

బేతంచెర్ల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో వెటర్నరీ సిబ్బంది నిర్వహించే బ్లాంకెట్ సర్వే ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు సూచించారు. గురువారం కొలుములపల్లె గ్రామంలో పశుసంవర్ధకశాఖ సిబ్బంది ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల డివిజన్‌లో 15 మండలాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బ్లాంకెట్ సర్వే వెటర్నరీ సిబ్బంది నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా బేతంచెర్ల మండలంలోని గ్రామాల్లో పశువుల సంఖ్య పశువుల ఉత్పత్తి పశువుల పెంపకందారులపై సర్వే కింద 3,336 పశువుల పెంపకందారుల ఇళ్ల సర్వే చేయాలని సిబ్బందికి టార్గెట్ ఇచ్చినట్లు తెలిపారు. ఇందులో భాగంగా బేతంచెర్ల మండలంలో ఇప్పటికే 1912 ఇళ్లను వెటర్నరీ సిబ్బంది 57 శాతం సర్వే పూర్తి చేశారని, ఇంకా 43 శాతం ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలో కొలుములపల్లె ఆర్.కొత్తపల్లి ఆర్ఎస్ రంగాపురం గ్రామాల్లో జరిగే బ్లాంకెట్ సర్వే తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట పశుసంవర్ధకశాఖ ఏడీ వసంతలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా మాస శివరాత్రి పూజలు

చాగలమర్రి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని బుగ్గమల్లేశ్వర ఆలయంలో గురువారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మాస శివరాత్రి పూజలు వైభవంగా నిర్వహించారు. వేద పండితుడు మారుతీప్రసాద్ ఆధ్వర్యంలో ఈశ్వరస్వామికి జల, క్షీరాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. శివపార్వతులకు అభిషేకాలు చేశారు. ఆర్యవైశ్యులు నవతాప్రసాద్, లక్ష్మణబాబు, సుబ్రహ్మణ్యం, వినోద్‌కుమార్, మధు, శ్రీనివాసులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతకు కృషి: డీఈవో

శిరివెళ్ల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నట్లు డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు. శిరివెళ్లలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న విద్యా సామగ్రి, బోధన తదితర వాటి గురించి పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. డిప్యూటీ డీఈవో డీటీ శంకర్‌ప్రసాద్, హెచ్‌ఎం గోవిందరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

చాగలమర్రి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నబోదనం, పెద్దబోదనం, తిప్పనపల్లె గ్రామాల్లోగల అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల గురువారం తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో రికార్డులను, పౌష్టికాహార పంపిణీని పరిశీలించారు. కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని అన్నారు. చిన్నారులకు ఎత్తు, బరువు లను నమోదు చేయాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

డోన్ రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో మూడో విడత ప్రవేశానికి ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని డోన్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 26వ తేదీలోపు సాయంత్రం 5గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 27వ తేదీ 11.55 గంటలోపు ఐటీఐలలో వెరిఫికేషన్ చేసుకోవాలని చెప్పారు. 29న ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి

డోన్ టౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యమని, ప్రతి పేద వారి కుటుంబం బంగారు కుటుంబం కావాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. డోన్ మండలంలో గురువారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. పాతపేటలో ఉన్న పాత ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించి అనంతరం ఆ ప్రాంగణంలో రైతుబజారు, అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే నెల రెండో వారంలోపుపై పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుని అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవానికి సన్నద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఫ్లైఓవర్ నుంచి పాతపేటలోకి వాహనాల రాకపోకలు సులభతరం కావడానికి ప్రత్యేక ర్యాంపు నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులను సూచించారు. పాతపేటలోని జడ్పీ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం పథకాన్ని, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. భోజనం వండుతున్న విధానం, శుభ్రత విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం రుచి శుచిపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డీవో కేపీ నరసింహులు, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్, నాయకులు లక్కసాగరం లక్ష్మిరెడ్డి, విజయభట్టు, కోట్రికే హరికిషన్, ఓబులాపురం శేషిరెడ్డి, ఓంప్రకాష్, పెద్ద కేశవయ్యగౌడు, శేషఫణిగౌడు, టీఈ రాఘవేంద్రగౌడు, ఎల్లాగౌడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

నేడు ప్యాపిలికి ఎమ్మెల్యే కోట్ల

ప్యాపిలి: ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి ప్యాపిలి పట్టణానికి రానున్నట్లు గురువారం టీడీపీ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ విశ్రాంతి భవనంలో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఎమ్మెల్యే వినతులు స్వీకరించనున్నట్లు తెలిపాయి. ప్రజలు గ్రామాల్లో నెలకొన్ని వివిధ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతులు అందజేయాలని పార్టీ వర్గాలు సూచించాయి.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుడి గ్రామోత్సవం



కోవెలకుంట్లలో శ్రీకృష్ణుడిని ఊరేగిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల పట్టణంలో గురువారం శ్రీకృష్ణుడి ప్రతిమకు గ్రామోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక వారి ఆధ్వర్యంలో ఈ నెల 16న శ్రీక్రిష్ణుని ప్రతిమను ప్రతిష్ఠించి శ్రీక్రిష్ణుని వేడుకలను ప్రారంభించారు. ఆరు రోజుల పాటు ప్రతిమకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గురువారం మధ్యాహ్నం ప్రతిమను ప్రత్యేక రథంలో ఎక్కించి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాంస్కృతిక కార్యక్రమాల మధ్య వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్యాపిలి: మండలంలోని జలదుర్గం గ్రామంలో గురువారం శ్రీకృష్ణుడి విగ్రహం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. త్రైత్త సిద్ధాంత ప్రబోధనంద సేవా సమితి ఇందు జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, భజనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మంత్రి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

- ఎట్టకేలకు కొలిమిగుండ్లలో పందుల తరలింపు

కొలిమిగుండ్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కొలిమిగుండ్లలో ఎట్టకేలకు పంచాయతీ అధికారులు పందుల తరలింపునకు శ్రీకారం చుట్టారు. పందుల బెడదపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనాలు, రైతుల విజ్ఞప్తి మేరకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి గ్రామం నుంచి పందులను తరలించాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఇటీవల బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళిగౌడు ప్రత్యేక చొరవ తీసుకొని గురువారం పందుల తరలింపు కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక పోలీసుల సహకారంతో పందులను పట్టి ఆటోల్లో ఇతర ప్రాంతాలకు తరలించారు. ఎస్ఐ గోపాల్, పంచాయతీ కార్యదర్శి ఉదయ్, సర్పంచ్ శివరాముడు పాల్గొన్నారు.

భానుముక్కల సొసైటీ చైర్మన్‌గా అబ్దుల్ కలాం

బనగానపల్లె, ఆగస్టు 15, (ఆంధ్రజ్యోతి): భానుముక్కల సొసైటీ అధ్యక్షుడిగా గురువారం అత్తార్ అబ్దుల్ కలాం ప్రమాణ స్వీకారం చేశారు. టీడీపీ మైనార్టీ టీడీపీ నాయకుడు అబ్దుల్ కలాంచే సొసైటీ సీఈవో సయ్యద్ అబ్దుల్ మునాఫ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అత్తార్ అబ్దుల్ కలాం మాట్లాడుతూ తనను సొసైటీ చైర్మన్‌గా నియమించిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ ద్వారా రైతులకు సకాలంలో రుణాలు, విత్తనాలు, ఎరువులు సక్రమంగా అందేలా కృషి చేస్తామన్నారు. సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. ప్రతి రైతుకు రాజకీయాలకు అతీతంగారుణాలు అందేలా చూస్తామన్నారు. అబ్దుల్ సలాంను భానుముక్కల సిబ్బందితో పాటు బనగానపల్లె పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, ఏఈవో శ్యామీర్, మాధవరెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు కాశీంబాషా అభినందించారు.

డేంజర్‌లో దద్దనాల

(5వ పేజీ తరువాయి)

ప్రాజెక్టుకు ఉన్న రెండు ప్రధాన గేట్లలో ఓగేటు 15ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

నాలుగేళ్ల క్రితం గేట్లకు సంబంధించి..

దద్దనాల ప్రాజెక్టుకు సంబంధించి నాలుగేళ్ల క్రితం ప్రధాన గేట్లు, పూడిక గేట్లు మరమ్మతులు చేయడానికి ప్రయత్నించారు. ఒక గేటు మాత్రమే మరమ్మతులకు నోచుకుంది. మరో ప్రధానగేటు మాత్రం నేటికీ మరమ్మతులకు నోచుకోలేదు. అలాగే పూడిక, స్లూయిస్ గేట్లు కూడా మరమ్మతులకు నోచుకోలేదు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 25అడుగులు కాగా 10అడుగులకు పైగా లోతు ప్రాజెక్టులో పూడికతో నిండిపోయింది.

ఇరవై ఏళ్ల తర్వాత పంట కాల్వలకు..

20 సంవత్సరాల తర్వాత దద్దనాల ప్రాజెక్టు పంట కాల్వలకు మోక్షం లభించింది.




దద్దనాల ప్రాజెక్టు గేట్లు, పూడిక గేట్లు, ఇతర అభివృద్ధి పనులకు రూ.6కోట్లతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించి పూడిక గేట్లు, ప్రధాన గేట్ల మరమ్మతులు చేపట్టి ప్రాజెక్టు పరిధిలోని రైతులకు ఇబ్బందులు లేకుండా చేస్తాం

రూ.6 కోట్లతో ప్రతిపాదనలు

- రామ్మోహన్‌రెడ్డి, ఏఈ, మైనర్ ఇరిగేషన్, బనగానపల్లె

మరమ్మతులకు నోచుకోని పూడిక గేట్లు

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చొరవ తీసుకొని రూ.10.60లక్షలు నిధులు విడుదల చేయించారు. నాలుగు నెలల క్రితం ఆనిధులతో దద్దనాల ప్రాజెక్టు పంట కాల్వల్లో పూడిక తీత, ముళ్లకంపల తొలగింపు కార్యక్రమం మైనర్ ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టారు.



దద్దనాల ప్రాజెక్టు

మొరాయించిన గేటు..

పది రోజుల క్రితం దద్దనాల ప్రాజెక్టుకు సంబంధించి పనిచేస్తున్న ఒక్క గేటు కూడా మొరాయించింది. ఎట్టకేలకు కర్నూలు నుంచి నిపుణులను రప్పించి మైనర్ ఇరిగేషన్ అధికారులు గేటు యథావిధిగా పనిచేసేలా చర్యలు తీసుకున్నారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా గంగాదేవి పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ

అవుకు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గురువారం గంగాదేవి, పోతు రాజు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం ఆలయంలో వేద పండితులు యంత్ర ప్రతిష్ఠ, పీటపూజ, శయ్యాదివాసం, విగ్రహ ప్రతిష్ఠ, జ్వాలాతోరణం, పూర్ణాహుతి, కలశోద్ధారణను నిర్వహించారు. టీడీపీ నాయకులు ఎస్ రామకృష్ణారెడ్డి, మారంపుల్లారెడ్డి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని పూజలు నిర్వహించారు.

పీ4 పథకం నిరుపేదలకు వరం

కోవెలకుంట్ల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన పీ4 పథకం నిరుపేదలకు ఒక వరమని టీడీపీ నాయకుడు ఎస్ఏ గఫూర్ అన్నారు. గురువారం కోవెలకుంట్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2016లో విదేశీ విద్యను అప్పటి సీఎం చంద్రబాబు ప్రవేశ పెట్టారని గుర్తుచేశారు. ఆ పథకం ద్వారా లబ్ధి పొందిన కార్తికేయ ఐర్లాండులో రెండు కంపెనీలు పెట్టి ప్రయోజ కుడైనట్లు తెలిపారు.

వీధి కుక్కలను నిర్మానుష్య ప్రదేశంలో వదిలేయాలి

బనగానపల్లె, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వీధికుక్కలను నిర్మానుష్య ప్రదేశంలో వదిలేయాలని ఈవోఆర్డీ ఈవోఆర్డీ బాలాంజనేయులు ఆదేశించారు. గురువారం పట్టణంలోని గ్రామ పంచాయతీ, పశుసంవర్ధక శాఖ ఏడీ మారుతి ఆధ్వర్యంలో పశువైద్య సిబ్బందితో వీధికుక్కలకు రేబిస్ టీకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బనగానపల్లె, భానుముక్కల పరిధిలో వీధి కుక్కలు ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు కల్గిస్తుండడంతో అక్కడి ప్రజలు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారన్నారు. అందుకు స్పందించిన మంత్రి వీధికుక్కలకు రేబిస్ టీకాలు వేసి నిర్మానుష్య ప్రాంతాల్లో వదలి పెట్టాలని ఆదేశించడంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. పశువైద్యశాల డాక్టర్ బ్రహ్మానదరెడ్డి, డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, రాఘవేంద్రరెడ్డి, గ్రామ పంచాయతీ ఈవో సతీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలి

ఆళ్లగడ్డ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కోరారు. గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబును సీఎం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గం అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. అలాగే రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

మంత్రి బీసీని అభినందించిన సీఎం చంద్రబాబు



సీఎం చంద్రబాబుతో మంత్రి బీసీ

బనగానపల్లె, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ఒంటిమిట్ట జడ్పీటీసీ అభ్యర్థి కృష్ణారెడ్డి విజయంలో కీలకపాత్ర పోషించిన అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, మంత్రి రాంప్రసాదరెడ్డిలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమరావతిలోని ఉండవల్లి నివాసంలో గురువారం అభినందించారు. నేతలంతా కలసికట్టుగా పనిచేసి కా ర్యకర్తలను సమన్వయం చేసుకొని గెలిపించారన్నారు. ఇది ప్రజాస్వామ్య విజయమన్నారు. అలాగే పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో విజయం సాధించిన లతారెడ్డిని సీఎం అభినందించారు.

యువకుడిపై దాడియత్నం

ఆళ్లగడ్డ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని రామాలయం వీధిలో ఓ ఘటన ఉద్రిక్తతకు దారి తీసింది. కాలనీకి చెందిన ఒక అమ్మాయిని ఓ యువకుడు వేధించాడన్న సమాచారంతో అమ్మాయి తరుపు వారు దాడికి ప్రయత్నించారు. యువకుడి తరుపు వారు కూడా వాదనలకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న ఎస్ఐ జయప్ప అక్కడికి చేరుకోని పరిస్థితిని సద్దుమణిగేలా చేశారు. ఈ కాలనీలో ఆకతాయిల హల్‌చల్ ప్రతి రోజు అధికంగా ఉందని కాలనీ వాసులు తెలిపారు. ఆకతాయిల అల్లరిని కట్టడి చేయ్యాలని స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకొని పోయారు. ఈ ప్రాంతంలో పోలీసుల నిఘా ఉండేలా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కాలనీ వాసులకు హామీ ఇచ్చారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

బేతంచెర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): భర్త, అత్త, మామలు అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నారని ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ తిరుపాలు తెలిపిన వివరాలివి. గూటుపల్లె చెందిన కురువ లతకు మద్దికెర మండలం పెరవలి గ్రామానికి చెందిన శశికుమార్‌తో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. అదనపు కట్నం తీసుకురావాలని లతను భర్త శశికుమార్, మామ నాగన్న, అత్త రత్నమ్మ వేధిస్తున్నారు. దీంతో ఆమె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ముగ్గురిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ